కళ్లకు గంతలు కట్టుకున్నారు

- లంక భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- తెలిసీ పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- మట్టి మాఫియాతో దోస్తీయే కారణమంటూ ఆరోపణలు


నడవపల్లి నుంచి మట్టిని తరలిస్తున్న లారీని అడ్డుకున్న యువకులు


నడవపల్లి లంక భూముల్లో క్రేన్‌తో మట్టి తవ్వకం

కాట్రేనికోన: సముద్ర తీరం, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో గుప్పెడు మట్టిని కూడా తీయకూడదని సుప్రీంకోర్టు నిబంధనలున్నాయని తెలుసు.. అయినా అక్రమార్కులు నిత్యం నదీ తీరం వెంబడి నడవపల్లి లంక భూముల్లో ఆరేడు అడుగుల లోతు వరకూ మట్టిని తవ్వుకుపోతున్నారని తెలుసు. అయినా కాట్రేనికోన మండల రెవెన్యూ అధికారుల కళ్లకు అవేమీ కనిపించడం లేదు. పగలురాత్రి అన్న తేడాలేకుండా తీరాన్ని ఛిద్రం చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కేవలం సవా'లక్షల' కారణాలతో రెవెన్యూ అధికారులు మట్టి మాఫియాతో దోస్తీ చేస్తూ ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. మండలంలోని నడవపల్లి పంచాయతీ పరిధిలో మురమళ్ళ-పల్లంకుర్రు ఏటి గట్టు వెంబడి నడవపల్లిలో నదీ పరివాహక ప్రాంతంలో లంక భూములను సుమారు 7 అడుగులు లోతు వరకే తవ్వేసి మట్టిని తరలించుకుపోతున్నారు. అక్రమార్కులు నిత్యం క్రేన్లు పెట్టి మరీ తవ్వేస్తూ భారీ టారస్ లారీలతో మట్టిని తరలించుకుపోతున్నా అధికారులు మాత్రం కిక్కురుమనడం లేదు. గోదావరికి వరదలు వచ్చినపుడు నదీ ప్రవాహ వేగానికి లంక భూములతో పాటు ఏటుగట్టు కోతకు గురై గ్రామాలను ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది.

వరదలొస్తే ఏంటి గతి?

గతేడాది గోదావరికి వచ్చిన వరదలకు నదీ పరివాహక ప్రాంత ప్రజలతో పాటు అధికారులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. వరద నీరు ఏటి గట్టు పైవరకూ రావడంతో నడవపల్లి, పల్లంకుర్రు, బూలవారిమొండి వంటి ప్రాంతాల్లో ప్రజలు హడలిపోయారు. బూలవారిమొండి ప్రాంతంలో ఏటిగట్టు పల్లపు ప్రాంతం కావడంతో వరద నీటిని అదుపు చేసేందుకు అధికారులు పర్యవేక్షణలో స్థానికులు రేయింబవళ్ళు పనిచేసి ఇసుక బస్తాలను వేసి గట్టుని బలపరిచారు. లంక భూములు వరద నీటి ప్రవాహం తగ్గించి ఏటి గట్టును రక్షించేందుకు దోహద పడతాయి. లంక భూములు తవ్వేయడంతో ఏటి గట్టు బలహీనపడి కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ అక్రమ మట్టి తవ్వకాలు ఇలాగే కొనసాగుతూ పోతే వరదలొచ్చినపుడు తమ గతేంటని నదీపరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే కాట్రేనికోన మండల రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో అవినీతిలో కూరుకుపోయారని, అందుకే మట్టిని తరలిస్తున్న వాహనాలపై కనీసం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ కార్యాలయంలోని ఓ కీలక అధికారికి మట్టిమాఫియా నుంచి ప్రతి నెలా పెద్ద మొత్తంలో సొమ్ములందుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టిమాఫియా ఆగడాలపై కాట్రేనికోన తహసీల్దార్ బి.మృత్యుంజయరావును వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని, వీఆర్ఓను పంపించామని బదులిచ్చారు.

భారీ వాహనాలతో ధ్వంసమవుతున్న రోడ్లు

మండలంలో మట్టి మాఫియా ఆగడాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన గ్రామీణ ప్రాంత రహదారులు ధ్వంసమవుతున్నాయి. కాట్రేనికోన నుంచి చిర్రయానం వెళ్లే రహదారిని రెండేళ్ళ క్రితం రూ.8 కోట్లతో బీటీ రోడ్డు చేశారు. నడవపల్లి నుండి మట్టి తరలిస్తున్న వాహనాలతో కాట్రేనికోన-నడవపల్లి రోడ్డు గోతులు పడి దిగబడిపోతుంది. అధిక బరువుతో మట్టిని తరలిస్తున్న వాహనాల రాకపోకల కారణంగా రహదారులు ధ్వంసమవుతున్నాయని నడవపల్లి నుంచి మట్టిని తరలిస్తున్న లారీని లచ్చిరాజు చెరువుకు చెందిన యువకులు శనివారం అడ్డుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను తక్షణమే నిలిపేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాగునీటి కోసం ఇంజరంలో రైతుల ఆందోళన


ఇంజరం వంతెన వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లరేవు: నెల రోజులుగా సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రైతులు శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంతా కలిసి మసకపల్లి నుంచి ఇంజరం వంతెన వరకు కాలువ పరిస్థితిని పరీక్షించారు. పలుచోట్ల కాలువలు పూడికలతో ఉండడాన్ని చూసి ఇంజరం వంతెన వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు, రాంజీనగర్, మూలపొలం, పత్తిగొంది గ్రామాలతో పాటు నీలపల్లి, కోరంగి తదితర పంచాయతీల్లో సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం తమ ప్రాంతానికి వంతు ఇచ్చారని అయినా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన వద్ద తూములు పూడుకుపోయి నీరు రాని పరిస్థితి నెలకొందని, తామే పూడికలు తీశామన్నారు. అధికారులు చమురు సంస్థలు, రొయ్యల చెరువుల యజమానులు ఇచ్చే డబ్బులకు కక్కుర్తిపడి తమను ఇబ్బందుల పాలు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. నిరసనలో రైతులు కాకర్లపూడి రాంబాబురాజు, మాగాపు సత్తిబాబు, కావూరి వెంకటేశ్వరరావు, కాదా సాయి, పువ్వల ప్రసాద్, గోపి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం


పవర్ లిఫ్టర్లతో ముఖ్య అతిథులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సభా వేదికపై 10వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్, జూనియర్ మెన్ అండ్ వుమెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2023 పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విజేతల వివరాలను అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. పోటీల్లో స్ట్రాంగ్ వుమెన్లుగా డి.కుసుమ(అనకాపల్లి జిల్లా), బి.చంద్రిక (గుంటూరు జిల్లా), డి.అమృత వర్షిణి (కృష్ణా జిల్లా) సత్తా చాటారు. టీమ్ చాంపియన్‌షిప్స్‌గా ప్రకాశం, విజయనగరం, కృష్ణా జిల్లా టీమ్స్ నిలిచాయి. స్కాట్, బెంచ్, డెడ్ లిఫ్ట్ 76 కిలోల విభాగంలో వి.రేవతి(గుంటూరు జిల్లా), వి.మాధురి(కడప జిల్లా), వి.శ్రీవల్లి(విజయనగరం జిల్లా) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. 84 కిలోల విభాగంలో కె.కల్పన (కృష్ణా జిల్లా), పి.వందన(కోనసీమ జిల్లా), ప్లస్ 84 కిలోల విభాగంలో బి.చంద్రిక(గుంటూరు జిల్లా), వి.సుభాషిణి(కృష్ణా జిల్లా) మొదటి రెండు స్థానాలు గెలుచుకున్నారు. బెంచ్ కేటగిరి 57 కిలోల విభాగంలో కె.శ్రీసౌమ్య(కడప జిల్లా), 76 కిలోల విభాగంలో వి.మాధురి(కడప జిల్లా) ప్రథమ స్థానంలో నిలిచారు. 47 కిలోల విభాగంలో స్కాట్, బెంచ్, డెడ్ లిఫ్టికు సంబంధించి కె.దీప్తి(ప్రకాశం జిల్లా), కె.వీర నాగు అను(కృష్ణా జిల్లా), కె.అమూల్య(ప్రకాశం), 52 కిలోల విభాగంలో డి.అమృత వర్షిణి(కృష్ణా), కె.అర్పిత(ప్రకాశం), ఎం.ఐశ్వర్య(ప్రకాశం), 57 కిలోల విభాగంలో బి.సంతోష కావ్య(విజయనగరం), ఎస్ఎల్ నిహారిక(ప్రకాశం), సి.త్రివేణి(విజయనగరం), 63 కిలోల విభాగంలో డి.కుసుమ(అనకాపల్లి), ఎం.పూర్ణిమ(ప్రకాశం), వి.దివ్య(ప్రకాశం), 69 కిలోల విభాగంలో ఎస్.జరా (విజయనగరం), ఎన్.షైన్(ప్రకాశం), ఎం.భావన(కోనసీమ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

వాడపల్లి వెంకన్నకు కలెక్టర్ దంపతుల ప్రత్యేక పూజలు


తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత దంపతులతో కలసి ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. కలెక్టర్ మాధవీలత దంపతులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామి వారి చరిత్ర వివరించారు. అనంతరం ఆమెతో పాటు చిర్ల జగ్గిరెడ్డి ఆలయంలో పర్యటించి భక్తుల సమస్యలను తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్ మృతి


నిర్మల (ఫైల్)

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం శివారు అడ్డాలపాలెంలో ఈ నెల 4న రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్ గెడ్డం నిర్మల (48) శనివారం మృతి చెందింది. ఈ మేరకు కాకినాడ నుంచి సమాచారం వచ్చినట్లు పోలీసులు తెలిపారు. 4వ తేదీన అడ్డాలపాలెంలో నిర్మిస్తున్న భవనం వద్ద పనిచూసుకునే నిమిత్తం బైక్‌పై ఆమె వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఆ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. కాగా ప్రమాదంలో గాయపడిన ఆమెను తొలుత అమలాపురం, అటుపై కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిర్మల మృతి చెందారు. మృతురాలికి భర్త నవీన్ బాబు, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమె మృతికి సహచర అంగన్‌వాడీలు తీవ్ర సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చెరకు, ప్రత్యేక పువ్వులతో స్వామిని అలంకరించారు. ఆలయాన్ని ప్రత్యేక పువ్వులతో అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వామికి పటికబెల్లం తులాభారంగా సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

శిథిల స్థితిలో బోడిపాలెం వంతెన


దెబ్బతిన్న బోడిపాలెం వంతెన రెయిలింగ్

కపిలేశ్వరపురం: కొత్తపేట-కపిలేశ్వరపురం నియోజకవర్గాలను కలిపే బోడిపాలెం వంతెన శిథిల స్థితిలో ఉంది. బ్రిటిషు కాలంలో నిర్మించిన ఈ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇనుప భాగాలు తుప్పుపట్టి ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలు రాకపోకల సమయంలో రైతులు అవస్థలు పడుతున్నాయి. కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మమర్రి దైవ, పర్యాటక ప్రాంతానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వంతెన మీదుగా తరలి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత గల బోడిపాలెం వంతెనను పున:నిర్మించాలని పర్యాటకులు, భక్తులు, లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ర్యాలి కేశవస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి


స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో కృష్ణచైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి పి.వెంకట జ్యోతిర్మయి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆశీర్వచనం అందించారు. అనంతరం ఈవో కృష్ణచైతన్య స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం


విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీ గణపతి హోమం శనివారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఈ పూజలో పాల్గొన్నారు. అలాగే స్వామివారి సన్నిధిలో చిన్నారులకు అన్నప్రాశనలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ


మాచవరంలో లక్ష్మీగణపతికి పూజలు చేస్తున్న దంపతులు

అంబాజీపేట: మాచవరం శివాలయం రోడ్డులో డీకేఆర్ గార్డెన్స్‌లో వేంచేసిన వరసిద్ధి వినాయక ఆలయంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సత్తిబాబు పర్యవేక్షణలో దొమ్మేటి శ్రీనివాసరావు, నిర్మలకుమారి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి గణపతి హోమం, శాంతి కళ్యాణం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అంజేశారు.


పసిడి కుండల ప్రతిష్ఠ

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయ శిఖరానికి పసిడి కుండలను శనివారం ప్రతిష్ఠించారు. అమలాపురానికి చెందిన నాగలక్ష్మి ఐరెన్ స్టోర్స్ కాంట్రేగుల రాంప్రసాద్, అరుణ్‌కుమార్, మల్లేశ్వరరావులు సమకూర్చిన రూ.20 లక్షలతో రాజగోపురాన్ని నిర్మించారు. రూ.40 వేలు విలువ చేసే మూడు పసిడి కుండలను ప్రతిష్ఠించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లంక గ్రామాల అభివృద్ధికి కృషి

కపిలేశ్వరపురం: మండలంలోని లంక గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక సచివాలయం వద్ద శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు, ఉద్యాన పంటల సాగు తదితర అంశాలపై చర్చించారు. గ్రామస్తులు లేవనెత్తిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు.

క్యాన్సర్ బాధిత మహిళకు చేయూత


క్యాన్సర్‌తో బాధపడుతున్న సత్యవతికి సొమ్ము అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళకు విశ్వబ్రాహ్మణ యువత శనివారం చేయూతనందించారు. ఎస్.మూలపాలెం గ్రామానికి చెందిన మొగలి సత్యవతి క్యాన్సర్‌తో బాధపడుతుంది. ఆమెకు విశ్వబ్రాహ్మణ యువత కోసూరి చిదంబరాచారి, బొల్లోజు మణిశ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ.12 వేలు సేకరించారు. ఈ సొమ్మును సంఘ జిల్లా అధ్యక్షుడు కట్టోజు సన్నయ్యదాసు, వాణిజ్య విభాగం కార్య నిర్వహణ కార్యదర్శి బోళ్ల వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ స్థాపించి 12 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అమలాపురం హైస్కూలు సెంటరులో ఆదివారం ఉదయం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి వేడుకలను ప్రారంభిస్తామన్నారు. వేడుకలకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా మాణిక్యాంబ అమ్మవారి జాతర


మాణిక్యాంబ అమ్మవారు

ఐ.పోలవరం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు 20 రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి మరుసటి రోజు ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కాలక్షేపం, భారీ అన్న సమారాధనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పచ్చిపూలతో అలంకరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సాయం



పూర్వ విద్యార్థులు నిర్మించిన సైకిల్ స్టాండ్

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గోల్డెన్ గ్రూప్‌గా ఏర్పడి తాము చదువుకున్న పాఠశాలకు అపూర్వ సాయం అందించారు. సుమారు రూ.3 లక్షలు వెచ్చించి పాఠశాల స్వాగత ద్వారం, తరగతి గదులకు ఐరన్ గ్రిల్స్, విద్యార్థుల సైకిళ్లకు రక్షణగా సైకిల్ స్టాండ్ నిర్మించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న చదువుల తల్లి సరస్వతి, పాఠశాల స్థల దాత నామన వెంకాయమ్మ విగ్రహాలకు రక్షణగా పైన గొడుగులు ఏర్పాటు చేశారు. జీవితంలో తాము ఉన్నతంగా స్థిరపడేందుకు కారణమైన తమ పాఠశాల అభివృద్ధే లక్ష్యంగా ఆయా సేవా కార్యక్రమాలు చేసినట్లు పూర్వ విద్యార్థులు రోళ్ల చక్రవర్తి, దంగేటి రాంబాబు, అయితంపూడి శ్రీనివాస్, దుప్పి సత్యన్నారాయణ, బొంతు జిన్ను తదితరులు తెలిపారు.

అల్లర్ల కేసుల ఎత్తివేత ఆలోచనను స్వాగతిస్తున్నాం

అమలాపురం టౌన్: అమలాపురం అల్లర్లకు సంబంధించి కేసులు ఎత్తివేసే విషయాన్ని ఆలోచిస్తున్నామని ఎంపీ, ఉభయ గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి చేసిన సూచనప్రాయ ప్రకటనను స్వాగతిస్తున్నామని జిల్లా కాపునాడు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆనాటి అల్లర్లలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలగడాన్ని ఆయన ఖండించారు.

ఎమ్మెల్యే అశోక్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎమ్మెల్యే అశోక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభిమానులు

యానాం: కాకినాడ సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చిత్రపటానికి అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పండు సిద్దార్థకుమార్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. శనివారం స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిద్దార్థకుమార్ మాట్లాడుతూ యానాం వాసుల దశాబ్దాల కలను సాకారం చేసిన ఎమ్మెల్యే అశోక్ కృషి అనిర్వచనీయమన్నారు. యానాం నుంచి వెళ్లి పుదుచ్చేరిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఉద్యోగాలు చేసుకుంటూ అక్కడ నివసిస్తున్న వారికి సర్కార్ పొడిగింపు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కవల బాబు, బడుగు సూర్యప్రకాశరావు, ఆకుల సత్యనారాయణ, మద్దాల కృపావతి, ఎల్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఉచిత భోజనం అందజేత

తాళ్లరేవు: కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ పథకం ద్వారా ఐదుగురు అభాగ్యులకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శనివారం ఉచిత భోజనం, పండ్లు అందజేశారు. దడాల పురుషోత్తం, డా.రాజేంద్ర ప్రసాద్ సమకూర్చిన భోజనాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అభాగ్యులకు పంపిణీ చేశారు.

మంత్రి చొరవతో మృతుడి కుటుంబానికి పరిహారం

ఉప్పలగుప్తం: రవ్వ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుడు పెట్టా రామకృష్ణ మృతి విషయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవ తీసుకుని అతడి కుటుంబానికి వేదాంత, కెయిన్ ఎనర్జీల రవ్వ ఆన్‌షూర్ ప్లాంటు నుంచి పరిహారం లభించేలా కృషి చేశారు. పెట్టా రామకృష్ణ మృతిపై శుక్రవారం ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. నిరసనకు దిగినవారి డిమాండ్లకు ప్లాంటు యాజమాన్యం అంగీకరించలేదు. జిల్లా అధికారులు ప్లాంటు యాజమాన్యంతో చర్చించినా ఫలితం లేకపోకపోవడంతో శుక్రవారం అర్ధరాత్రి వరకు నిరసన కొనసాగింది. దీంతో స్థానిక నాయకులు విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న మంత్రి విశ్వరూప్‌కు తెలియజేశారు. మంత్రి విశ్వరూప్ వెంటనే ఫోన్ ద్వారా ప్లాంటు యాజమాన్యంతో చర్చలు జరిపారు. మృతుని భార్యకు ప్లాంటులో ఉద్యోగం, ఇద్దరు పిల్లల చదువు బాధ్యత, కంపెనీ నుంచి వచ్చే రూ.6 లక్షల బీమాతో పాటు మరో రూ.15 లక్షల పరిహారాన్ని బాధిత కుటుంబానికి అందించాలని ఆదేశించారు. మంత్రి మాటకు యాజమాన్యం కట్టుబడి డిమాండ్లకు ఒప్పుకోవడంతో ఆందోళనకారులు రాత్రి 12:30 సమయంలో నిరసన విరమించారు. రామకృష్ణ మృతికి మంత్రి స్పందించిన తీరుపై జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ జోగి రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పెట్టా మురళీకృష్ణ, జోగి రాజా, ముత్తాబత్తుల సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక నావ సీజ్

ఐ.పోలవరం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నావను శనివారం పోలీసులు పట్టుకున్నారు. కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఐ.పోలవరం మండలం, గుత్తెనదీవి గ్రామంలో వృద్ధ గౌతమి గోదావరిలో నావలపై ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. శనివారం అందిన ముందస్తు సమాచారం మేరకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నావను పోలీసులు పట్టుకున్నారు. మరో నావ పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో గోదావరిలోకి వెళ్ళిపోయింది. నావను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

దరియాలతిప్పలో అపరిశుభ్రంగా తాగునీరు


దరియాలతిప్పలో అపరిశుభ్రంగా ఉన్న తాగునీరు


యానాం: దరియాలతిప్ప గ్రామంలో సరఫరా చేసే తాగునీరు అపరిశుభ్రంగా ఉండటంతో ఆ గ్రామస్తులు శనివారం పీడబ్ల్యూడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉదయం, సాయంత్రం సరఫరా చేసే తాగునీరు మురికిగా వస్తుందని, దీంతో తాము అనారోగ్యం బారిన పడతామనే ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీటి చెరువులు నింపకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి పరిశ్రమలకు, రైస్ మిల్లులకు దరియాలతిప్ప ఏరియాలోని తాగునీటి కాలువల నుంచి రాత్రి వేళల్లో నీటిని మళ్లిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు


అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ విజయ్‌కుమార్

కాట్రేనికోన: పల్లం గ్రామంలో శనివారం ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర్ ఆదేశాలతో మండల మహిళా సమాఖ్య ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీని మహిళా సంఘం సభ్యులు చేపట్టారు. బాల్య వివాహాలు నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన అవసరమని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్, నాడు-నేడు నోడల్ అధికారి జి.విజయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాలెపు వీరవేణి, యక్రి ధనావతి, మల్లాడి సీతారామలక్ష్మి, పాలెపు బేబి తదితరులున్నారు.

ఆలయానికి పంచలోహ విగ్రహం సమర్పణ


వేంకటేశ్వరస్వామి ఆలయానికి పంచలోహ విగ్రహాన్ని సమర్పిస్తున్న దాత

అమలాపురం రూరల్: పాత బండారులంక బిళ్ళవారి వీధిలో ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి తంగిరాల సోమనాథ్‌పవన్, శ్రీదేవి దంపతులు వేంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మ వార్లకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో విలస కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉచిత కంటి పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ బండారులంక ఆధ్వర్యంలో 200 మందికి షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాసునాయక్, ఎంపీహెచ్ఓ కాశిన శేషబాబు, శ్రీనివాస బాల మిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, నల్లా శేషయ్య తదితరులు పాల్గొన్నారు.